ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : జిల్లాలోని 10 కేంద్రాల్లో ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించగా, 1,343 మంది విద్యార్థులకు 1,107 మంది హాజరైనట్లు తెలిపారు. 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహించగా 1,043మంది విద్యార్థులకు 859మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగు నీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు డీఈవో తెలిపారు.

10న సర్వసభ్య సమావేశం

డోర్నకల్, ఏప్రిల్ 7 : డోర్నకల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ బాలూ నాయక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస రావు ఆదివారం తెలిపారు. ఎంపీటీసీలు, వివిధ శాఖ అధికారులు సకాలంలో నివేదికలతో హాజరు కావాలన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న రమేశ్

గురువుకు ఆర్థిక సాయం

ఇనుగుర్తి, ఏప్రిల్ 7: అంతర్జాతీయ స్థాయి బాలీబాల్ క్రీడలో రాణించడానికి మెళకువలు నేర్పించిన ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ కోచ్ సట్ల భిక్షానికి ఆయన శిష్యులు ఆదివారం రూ. 5,116 ఆర్థిక సాయం అందజేశారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న గురువు పరిస్థితిని తెలుసుకొని రమేశ్, సంతు, ప్రవీణ్, శ్రీనివాస్, భిక్షపతి కలిసి ఆర్థిక సాయం అందజేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల శివారులో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని అమనగల్ గ్రామానికి చెందిన అరెపల్లి మహేశ్, హైమా దంపతుల కుమార్తె నవ్య (14) అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. తండ్రి సుతారి పని చేస్తూ.., తరచుగా తాగొచ్చి తల్లితో గొడవ పడే వాడు. ఎన్ని సార్లు చెప్పినా తన తీరు మార్చుకోలేదు. దీంతో నవ్య మనస్తాపానికి గురై ఈ నెల 4న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫార్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

WANTED

jobs Apply Now!

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565



నారాయణపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్

గ్రామపాలన గాలికి..

కొందరు ప్రత్యేక అధికారులు గ్రామ పాలనను గాలికొదిలారు. పల్లెలపై వారి పర్యవేక్షణ కొరవడడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. బాధ్యతలు చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు కొందరు గ్రామాల ముఖం కూడా చూడకపోగా, మరికొందరు చుట్టపు చూపుగా వస్తుండడంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోయాయి. – బయ్యారం, ఏప్రిల్ 7

పూడుకుపోతున్న డ్రైనేజీ

- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువు
- పల్లెపాలనపై దృష్టిసారించని కొందరు స్పెషల్ ఆఫీసర్లు
- గ్రామాల్లో పేరుకుపోతున్న పారిశుధ్యం
- తాగునీటికి ప్రజల ఇబ్బందులు
- సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్ల మధ్య సమన్వయ లోపం

పల్లె పాలనపై ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కొరవడింది. పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడాల్సిన పల్లెల్లో సమస్యలు తిష్ట వేసి, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. గత ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామపాలన సజావుగా సాగేలా స్పెషల్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. బయ్యారం మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా, వివిధ శాఖల అధికారులు, పాఠశాలల హెడ్‌మాస్టర్లను ప్రత్యేక అధికారులుగా ఏర్పాటు చేసింది. వీరు సర్పంచ్‌ల మాదిరిగా గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నిత్యం పర్యవేక్షించాలి. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలి. మొత్తంగా గ్రామ పాలన వీరి పర్యవేక్షణలోనే కొనసాగాలి. కానీ, కొందరు ప్రత్యేక అధికారులు తమ శాఖకు చెందిన విధులను మాత్రమే నిర్వర్తిస్తూ, గ్రామ పాలనను గాలికొదిలేశారు. గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ విధులను నామమాత్రంగా నిర్వర్తిస్తున్నారు. దీంతో గ్రామాల అభివృద్ధి కుంటుబడింది. పారిశుధ్యం పేరుకుపోతున్నది. నీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, హరితహారం మొక్కలు, నర్సరీలు ఎండిపోతున్నాయి. జీపీల ట్రాక్టర్లను సరిగ్గా వాడుకోకపోగా, కొన్ని చోట్ల దుర్వినియోగం చేస్తున్నారు. శ్మశాన వాటికల్లో వసతులు లేక అవస్థలు పడుతున్నారు. కొందరు ప్రత్యేక అధికారులు చుట్టపు చూపుగా గ్రామ పంచాయతీలను సందర్శిస్తుండగా, మరికొందరు రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు వారికి కేటాయించిన గ్రామాల ముఖం కూడా చూడకపోవడం విమర్శలకు తావిస్తున్నది. నారాయణపురం, వెంకటాపురం పంచాయతీల స్పెషల్ ఆఫీసర్‌గా డిప్యూటీ తహసీల్దార్ రవికి బాధ్యతుల అప్పగించారు. ఆయన అనారోగ్యంతో నెల రోజుల నుంచి సెలవుల్లో ఉండగా, ఇప్పటి వరకు మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వకపోవడంతో ఆ గ్రామాల పాలన అస్తవ్యస్తంగా తయారైంది. అదేవిధంగా ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నది. ఇలాంటి సమయంలో స్పెషల్ ఆఫీసర్లు నిత్యం గ్రామాలను పర్యవేక్షించకపోతే, రానున్న రోజుల్లో జనం తాగునీటికి ఇబ్బందిపడే ప్రమాదం ఉంది.

సమన్వయం లేక ఇబ్బందులు..

జీపీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్ల మధ్య సమన్వయం లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో చెక్‌పవర్ సర్పంచ్‌లు, సెక్రటరీలకు ఉండగా, ఇప్పుడు స్పెషల్ ఆఫీసర్లు, సెక్రటరీలు ఇచ్చారు. అయితే, కొన్ని గ్రామాల్లో సమన్వయ లోపం సెక్రటరీలకు ఇబ్బందిగా మారింది. గత పాలకవర్గాలు తీర్మానం ద్వారా చేసిన పనులకు బిల్లులు మంజూరు కాగా, వాటిని డ్రా చేసేందుకు స్పెషల్ ఆఫీసర్లు సంతకం చేయాలి. అయితే, తమ హయాంలో చేసిన పనులు కాకపోవడంతో స్పెషల్ ఆఫీసర్లు సంతకాలు పెట్టడానికి నిరాకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బిల్లులు డ్రా చేసుకోవడానికి ఓటీపీ చెప్పే విషయంలో కొందరు, సంతకాల కోసం మరికొందరు సెక్రటరీలను పలుమార్లు తిప్పించుకోవడంతో సమయభావం ఏర్పడి అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయి. సెక్రటరీలు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో సాగితేనే పల్లెల్లో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నెల్లికుదురు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షను పరిశీలించి విలేకరులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

పోటీ పరీక్షలకు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష పునాది

జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

నెల్లికుదురు, ఏప్రిల్ 7 : విద్యార్థులు భవిష్యత్‌లో రాయబోయే పోటీ పరీక్షలకు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష పునాది లాంటిదని జిల్లా విద్యాశాఖ అధికారి పీ రామారావు అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తరగతుల వారీగా ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయి..? 6వ తరగతిలో ప్రవేశాలకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు..? ఎంతమంది పరీక్షలు రాశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న తర్వాత మొదటగా రాసే పోటీ పరీక్ష మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష అన్నారు. రానున్న రోజుల్లో పోటీ పరీక్షలను ఎదుర్కోవడానికి పాఠ్యాంశాలపై పట్టు సాధించాలన్నారు. నెల్లికుదురు మోడల్ స్కూల్‌లో 116 మందికి 91 మంది హాజరయ్యారని తెలిపారు. 7వ తరగతిలో 12 సీట్ల కోసం ఏడుగురు, 8వ తరగతిలో 11 మందికి 10 మంది 9వ తరగతిలో ఆరుగురు పరీక్ష రాసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, మండల నోడల్ ఆఫీసర్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

పాతూరి రామయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న విజయసారథి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

గార్ల, ఏప్రిల్ 7: మద్దివంచ గ్రామానికి చెందిన పాతూరి రామయ్య ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి పిలుపునిచ్చారు. ఆదివారం మద్దివంచలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రామయ్య గ్రామ కార్యదర్శిగా ఉంటూ మద్దివంచలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి సంపాల వెంకన్న, బయ్యారం కార్యదర్శి సారిక శ్రీనివాస్, నాయకులు భిక్షమయ్య, రమేశ్, లోకేశ్, కృష్ణయ్య, వీరభద్రం, భద్రయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

కేసముద్రం, ఏప్రిల్ 7 : రంజాన్ సందర్భంగా మండల కేంద్రంలోని మసీదులో మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జాటోత్ హరీశ్‌నాయక్–జాటోత్ సుజాత దంపతులు ఆదివారం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు. మసీదులో ప్రార్థనల అనంతరం విందు ఆరగించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు నీలం దుర్గేశ్, కముటం శ్రీనివాస్, గుగులోత్ వీరూనాయక్, భూమాటి పురుషోత్తం, ముత్యాల శివకుమార్, కో ఆప్షన్ మెంబర్ నజీర్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులో ప్రార్థన చేస్తున్న శంకర్‌నాయక్, ముస్లింలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సైదులు (ఫైల్)

కురవి, ఏప్రిల్ 7 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన కురవి మండలంలో జరిగింది. ఎస్సై గోపి కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలం మల్యాలకు చెందిన పరాల సైదులు(36), అతడి భార్య నీలమ్మ తో కలిసి బైక్‌పై ఖమ్మం వెళ్లారు. శనివారం రాత్రి తిరిగి వస్తుండగా కురవిలోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొనడంతో సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. అతడి భార్య నీలమ్మకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే

ఇనుగుర్తి, ఏప్రిల్ 7: మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వ్యక్తిగత పీఏ గంగాధర్ తండ్రి, చిన్నముప్పారం బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ రాయిలి వెంకన్న ఆదివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఆయన సతీమణి సీతామహాలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, నెల్లికుదురు ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, కేసముద్రం ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి వెంకన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ వెంకన్న పాడె మోసి, దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : మండలంలోని జమాండ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అంబాల గోవర్ధన్ తల్లి శనివారం, కంబాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సందా వీరన్న తల్లి ఆదివారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తేళ్ల శ్రీను, లూనావత్ అశోక్‌నాయక్, షపీ, బండి వెంకన్న, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'డీలైట్' మక్కజొన్నతో అధిక దిగుబడి

నెల్లికుదురు, ఏప్రిల్ 7 : గోదావరి ప్లాంట్ సైన్స్ కంపెనీ వారి డీలైట్ రకం మక్కజొన్న సాగుతో ఎక్కువ దిగుబడిని పొందవచ్చునని కంపెనీ ఏఎస్ఎం పొందిల రాజు తెలిపారు. రామన్నగూడెంలోని పీర్నాకి సుధాకర్ సాగు చేసిన డీలైట్ రకం మక్కజొన్న పంటలో ఆదివారం క్షేత్రస్థాయి ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో కంకిలో 18 వరుసలు ఉంటాయని, ఒక్కో వరుసలో 42 గింజలుంటాయని తెలిపారు. పరమేశ్వర ఆగ్రో ఏజెన్సీ బాధ్యుడు దేవా సందీప్, ఎస్‌వోలు అన్వేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

- రూ.70 వేల నగదు, బంగారం అపహరణ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : ఆలయంలో చోరీ జరిగిన ఘటన పట్టణ శివారులో ఆదివారం జరిగింది. ఆలయ అర్చకుడి కథనం ప్రకారం.. మహబూబాబాద్ పట్టణ శివారు గోపాలపురం కాలనీలోని పెద్దమ్మ తల్లి ఆలయానికి శనివారం రాత్రి తలుపులు వేసి వెళ్లారు. మరుసటి రోజు ఆదివారం వచ్చి చూసే సరిగా గుడి తలుపులు పగులగొట్టి హుండీలోని బంగారు, వెండితో పాటు రూ.70వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ అర్చకుడు తెలిపారు.

పోలీసుల అదుపులో లింగ నిర్ధారణ దోషులు ?

కురవి, ఏప్రిల్ 7 : కురవి మండలంలోని తాట్య తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పిల్లిగుండ్ల తండాలో ఓ వ్యక్తి ఇంట్లో లింగ నిర్ధారణ కేంద్రం నిర్వహిస్తుండగా పక్కా సమాచారం మేరకు కురవి పోలీసులు శనివారం దాడులు నిర్వహించినట్లు సమాచారం. స్కానింగ్ మిషన్ స్వాధీనం చేసుకొని నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

తట్టుపల్లి బిడ్డకు అరుదైన గౌరవం

- రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న లోహిత్
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

లోహిత్

కురవి, ఏప్రిల్ 7 : కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన జంగం లోహిత్‌కు అరుదైన గౌరవం దక్కనుంది. తన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. మారుమూల గ్రామంలో పుట్టి తల్లిదండ్రుల ఆశలను తన ఆశయాలుగా మలుచుకుని అధ్యాపకుల సలహాతో 'ఆగ్రో హోమియోపతి' అనే అంశంపై రీసెర్చ్ చేసి ఈ నెల 10,11తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ హోమియోపతి మెడికల్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న లోహిత్ షార్ట్ టర్మ్ స్టూడెంటిషిప్ ఇన్ హోమియోపతి విభాగంలో ఆరు నెలలుగా ఆగ్రో హోమియోపతి అనే అంశంపై రీసెర్చ్ చేస్తున్నాడు. గైడ్ డాక్టర్ శ్రీవిద్య సూచనల మేరకు లోహిత్ సమగ్ర వివరాలతో రీసెర్చ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ హోమియోపతి ఆధ్వర్యంలో లోహిత్ పూర్తి చేసిన గ్రంథానికి అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ హోమియోపతి డే సందర్భంగా లోహిత్ రాష్ట్రపతి చేతుల మీదుగా న్యూఢిల్లీలోని యశోభూమి ద్వారకలో అవార్డు అందుకోనున్నాడు. తాను రీసెర్చ్ చేసిన గ్రంథానికి తెలంగాణ రాష్ట్రం నుంచి అవార్డు దక్కడంపై లోహిత్ సంతోషం వ్యక్తం చేశాడు. ఇది తన తల్లిదండ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని, మున్ముందు వైద్య విద్యకు సంబంధించి మరిన్ని ప్రాజెక్టులు రూపొందిస్తానని తెలిపాడు. లోహిత్‌కు అవార్డు రావడంతో తట్టుపల్లి గ్రామస్తులతోపాటు మండల, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 7 : దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని చేతి వృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పెరుమాండ్లజగన్నాథం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నలో బీజేపీ భారత రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. దేశంలో కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఈ 11న జ్యోతిరావు పూలే, అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుడ్డెల రామ్మూర్తి, యమగాని వెంకన్న, కుమార్, విక్రం, లక్ష్మీనారాయణ, మహేందర్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పెద్దవంగర జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దవంగర, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1998–1999 బ్యాచ్ విద్యార్థుల (సిల్వర్ జూబ్లీ) పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. తమకు పాఠాలు చెప్పిన గురువులు మధుసూదన్‌రావు, కమలాకర్, సాదిక్, శ్రీనివాస్, మోహన్, మురళీధర్‌ను సన్మానించారు. చదివిన పాఠశాల, పేద విద్యార్థులకు చేయూతనందించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి, సీసీఎస్ వరంగల్ సీఐ అబ్బయ్య, విజేందర్‌రెడ్డి, నగేశ్, రత్నాకర్‌రెడ్డి, కృష్ణ, సతీశ్‌గౌడ్, నిరంజన్, ఎల్లయ్య, జయమ్మ, హైమావతి, శివాని, సంధ్యారాణి, కల్పన, శ్రీలత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

నష్టపోయిన రైతులను అదుకోవాలి

నర్సింహులపేట, ఏప్రిల్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ జలాలను సక్రమంగా విడుదల చేయకపోవడంతో పంటలు ఎండి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు ఊడుగల లింగన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పడమటిగూడెం గ్రామంలో ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సారెస్పీ జలాలు సరైన సమయంలో విడుదల చేయకపోవడంతో చెరువు, కుంటలు ఎండిపోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటి బావులు, బోర్లలో చుక్క నీరు లేకుండా పోయిందన్నారు. మండలంలో వందల ఎకరాలకుపైగా పంటలు ఎండిపోయాయన్నారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందించాలని, రూ.2లక్షల రుణమాఫీ చేసి కొత్త రుణాలు అందించాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు యాకయ్య, కమలాకర్, నాగరాజు, కొమురయ్య, భిక్షం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం

కృతజ్ఞతలు తెలిపిన బలగం సినిమా మొగిలయ్య

నర్సంపేట రూరల్, ఏప్రిల్ 7 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి తాము జీవితాంతం రుణపడి ఉంటామని బలగం సినిమా మొగిలయ్య అన్నారు. ఆదివారం నర్సంపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మొగిలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొగిలయ్య మాట్లాడుతూ.. కేసీఆర్‌కు, మాజీ ఎమ్మెల్యే పెద్దికి తన కుటుంబం జీవితకాలం రుణపడి ఉంటుందన్నారు. తన కుటుంబానికి దళిత బంధు పథకం అందించిన దేవుడు కేసీఆర్ అని కొనియాడారు.

ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలు ఉండాలి

గార్ల, ఏప్రిల్ 7 : ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలు ఉండాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ 'ప్రధాన మంత్రికి కోటి ఉత్తరాల ఉద్యమ' కార్యక్రమాన్ని నెహ్రూ సెంటర్‌లో ప్రారంభించారు. జనరల్ బోగీల్లో ప్రయాణం చేయడం నరకంగా ఉందని సాధారణ బోగీల సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు, సామాజిక వేత్త డాక్టర్ అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. గంగావత్ లక్ష్మణ్‌నాయక్, బేతి వెంకటేశ్వర్లు, సుందర్, వినోద్‌కుమార్ జైన్, నారాయణ, రామయ్య, అశోక్, శ్రీనివాస్, 200మంది ప్రజలు ఉత్తరాలు రాసి పోస్టు డబ్బాలో వేశారు.

కార్డులు చూపుతున్న నాయకులు